క్లుప్తంగా

అశోక్‌ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ అధినేత జగన్



అశోక్‌తో ఫోన్లో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

కామవరపుకోట: ఇటీవల అనారోగ్యంతో విశాఖపట్టణం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఫోన్లో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అశోక్‌ను అన్న అంటూ సంబోధిస్తూ, అధైర్య పడొద్దని, అండగా ఉంటామని, మనకు రానున్న రోజులు మంచిగా ఉంటాయన్నారు.

హైస్కూల్‌లో విగ్రహాల ఆవిష్కరణ



పొంగుటూరు హైస్కూల్‌లో ప్రతిష్ఠించిన విగ్రహాలు

కొయ్యలగూడెం: పొంగుటూరు ప్రభుత్వ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పసుపులేటి రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తోట శ్రీనివాస్ తండ్రి తోట శ్రీమన్నారాయణ జ్ఞాపకార్థం సరస్వతి దేవి విగ్రహాన్ని నిర్మించారన్నారు. అదే విధంగా మార్ని వీర్రాజు తండ్రి పోతురాజు జ్ఞాపకార్థం గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు.


బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కామవరపుకోట: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని బీవీఎల్ మంగాదేవి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల వార్షికోత్సవంలో భాగంగా బుధవారం మండలంలో ఈస్ట్ యడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మంగాదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వలన వారికి పుట్టే సంతానం అనారోగ్యంతో బలహీనంగా ఉంటారన్నారు. బాలికలు, మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఏ కోటేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గిరిజన రైతుల అభివృద్ధికి కృషి



మునగలపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన రైతులు వ్యవసాయ రంగంలో ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (వెంకటరామన్నగూడెం) విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తి అన్నారు. బుట్టాయగూడెం మండలం మునగలగూడెం పునరావాస కాలనీలో బుధవారం గిరిజన రైతులకు ఆమె చేతుల మీదుగా 12 రకాల కూరగాయల విత్తనాల కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందిస్తున్న సహకారాన్ని అందుకుని గిరిజన సన్న, చిన్న కారు రైతులు అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ బహుజన మహాసభ నిర్వాహకులు మిడియం వెంకటస్వామి, రాంబాబు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ షాపుల అద్దెకు దరఖాస్తులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలోని పోలీస్ దుకాణ సముదాయాల్లో షాపులు, పోలీస్ క్యాంటీన్ అద్దె ప్రాతిపదికన లీజుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ తెలిపారు. పోలీస్ దుకాణ సముదాయాల్లోని షాపు నెంబర్ 2, 3, 4, 5, 6లను అద్దెకు ఇవ్వనున్నామని తెలిపారు. వివరాలకు ఏఆర్ డీఎస్పీ శ్రీహరి ఫోన్ నెంబర్ 94407 96602కు సంప్రదించాలన్నారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టతను వివరిస్తున్న బీజేపీ నాయకులు



జాతీయ పతాకాల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పలు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులకు జాతీయ జెండా పండుగ దినోత్సవ విశిష్టతను బీజేపీ నాయకులు తెలిపారు. ఉప్పల మెట్ట స్కూల్లో పట్టణ ఉపాధ్యక్షుడు తాటికొండ సుధాకర్, గంట అనురాధ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేమూరి శ్రీనివాస్, ఆర్య వైశ్య కల్యాణ మండపం వీధిలోని స్కూల్లో తుమ్మలపల్లి బ్రహ్మాజీ నేతృత్వంలో, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొంచాడ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్టీఐ కన్వీనర్ మాడా రామ్మోహన్ రావు రత్తయ్య, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు జొన్నాదుల స్వరాజ్యలక్ష్మి విద్యార్థులకు బిస్కెట్లు చాక్లెట్లు, జెండాలు పంపిణీ చేశారు. ఉప్పలమెట్టలో హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ గారి పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకుల ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వివిధ ప్రాంతాల్లో బుచ్చియ్యాచారి, బొల్లా ఏడుకొండలు, కుడిపూడి వెంకటేశ్వరావు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: స్థానిక మెయిన్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి, వందేమాతరం నినాదాలు చేశారు. అదే విధంగా జాతీయ పతాకాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.ఝాన్సీ, హెచ్ఎం తెల్లం సీతామహాలక్ష్మి, జీఎంఎస్‌కే ఎండీ షమీలా సుల్తానా, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.నూర్జహాన్, ఎం.సుధ, టి.లలిత, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత అవయవదాన వ్యవస్థాపకురాలు సీతామహాలక్ష్మి

జంగారెడ్డిగూడెం: అవయవదానంపై అపోహలు మానుకొని ప్రతీ ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని అఖిల భారత అవయవ దాన వ్యవస్థాపకురాలు గూడూరి సీతామహాలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం స్టెప్ (స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్) ఆధ్వర్యంలో నోవా, త్రివేణి విద్యా సంస్థలు, జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఆగస్టు 3న జాతీయ అవయవదాన దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 15 వరకు అవయవదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యాలయాల్లో సెమీనార్లు, ర్యాలీలు, అవగాహన సదస్సులు, చర్చా వేదికలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీంట్లో భాగంగానే జంగారెడ్డిగూడెంలో కార్యక్రమం నిర్వహించామన్నారు. అవయవ దాత అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించేందుకు తమిళనాడు, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అంగీకరించాయని, మిగిలిన ప్రభుత్వాలు ఈ దిశగా అడుగులు వేయాలన్నారు. అలాగే కేంద్రం ఇటీవల రైల్వే ఉద్యోగులకు లైవ్ ఆర్గాన్స్ (కిడ్నీ, లివర్) దానం చేసిన వారికి 42 రోజులు ప్రత్యేక సీఎల్స్‌గా మంజూరు చేసిందని, ఇదే విధంగా మిగిలిన శాఖల ఉద్యోగులకు మంజూరు చేయాలని కోరారు. అవయవ దాతల అంత్యక్రియలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10 వేలు మంజూరు చేశాయని, వాటితో పాటు అవయవ దానం చేసే కుటుంబాలు నిరాశ్రయులవుతున్నందున ఉద్యోగమో, ఉపాధి మార్గమో చూపించాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత అవయవ దాన సభ్యురాలు గొడవర్తి కన్యాకుమారి, స్టెప్ రాష్ట్ర నాయకులు గడా జగ్గారావు, జిల్లా అధ్యక్షుడు గద్ది నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: హైస్కూల్ వద్ద వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కమిటీ సభ్యులు, భక్తుల విరాళాలతో అన్న ప్రసాద వితరణ నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే అన్న ప్రసాదాన్ని చిన్న పిల్లల అనాథాశ్రమానికి పంపించినట్లు తెలిపారు. గన్నమని శ్రీనివాసు, కొమ్మసాని రవీందర్ రెడ్డి, కల్లూరి మురళీకృష్ణ, చల్లా వరప్రసాద్, చెన్నూరు శివాజీ కృష్ణ, భక్తాంజనేయ స్వీట్ షాప్ రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు కేంద్ర మంత్రి అభినందనలు



ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన ఉత్తమ రైతుల బృందం

కొయ్యలగూడెం: పంద్రాగస్టు ఎర్రకోటలో ప్రధాని చేతుల మీదుగా నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణకు రాష్ట్రం నుంచి హాజరైన నలుగురు రైతు దంపతులకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నట్లు కొయ్యలగూడేనికి చెందిన ఉత్తమ రైతుగా ఎంపికై న పొట్టి పోతుల పోతురాజు పేర్కొన్నారు. సేంద్రీయ ఎరువులను వినియోగించి యాంత్రీకరణ విధానం, బిందు సేద్యం ద్వారా పంటలు పండించి, పర్యావరణహితంగా అధిక దిగుబడులు సాధించినందుకుగాను పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులను ఎంపిక చేశామని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పోతురాజు, నాగమణి దంపతుతో పాటు, చిత్తూరు జిల్లా కుప్పం మండలం వేడుగంపల్లికి చెందిన ఎ.నారాయణ, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన దోమా పుణ్యవతి, ఒంగోలు చెందిన నల్లపు రాఘమ్మ దంపతులు ఉన్నారన్నారు. ప్రధాని సమక్షంలో పంద్రాగస్టు వేడుకలకు హాజరు కావడం సంతోషంగా ఉందని రైతులు పేర్కొన్నారు.

జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: పంద్రాగస్టు పర్వదినం పురస్కరించుకొని బుధవారం బయ్యనగూడెంలో వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్స్ విద్యార్థులు, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు వెయ్యి మందికి పైగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై ముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి చింతల్ రోడ్డు వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. పంగిడిగూడేనికి చెందిన వివాహితకు ఇద్దరు సంతానం కలరు. ఆమె భర్తతో మనస్పర్థల కారణంగా దూరంగా ఉంటోంది. పంగిడిగూడేనికి చెందిన సాదె విజయ్ కుమార్, వివాహిత వెంట పడుతూ అసభ్యకరంగా ప్రవర్తిసున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13 సాయంత్రం గీత స్కూల్ నుంచి తన పిల్లలను తీసుకొస్తున్న సమయంలో విజయ్‌కుమార్ వెంట పడి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తన కోరిక తీర్చమని వేధించాడు. దీంతో వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు.

డిగ్రీ రెండో విడత అడ్మిషన్లు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికిగాను బీఏ (పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (జువాలజీ) కోర్సులలో ప్రవేశానికి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 23 నుంచి 25 వరకు కళాశాల ఆప్షన్స్ నమోదు ప్రక్రియ ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందిన వారికి మాత్రమే ప్రభుత్వ స్కాలర్ షిప్ సదుపాయం ఉంటుందని, అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి బాలికలకు ఉచిత హాస్టల్ వసతి సదుపాయం కల్పిస్తామని ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు.

తాగునీటికి కటకట



నీరు రాని వాటర్ ట్యాంక్ వద్ద ఖాళీ బిందెలతో మహిళలు

పోలవరం రూరల్: తాగునీరు అందక పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ పరిధిలోని రెడ్డికుంకాల, మనుగోపుల, జిల్లెళ్లగూడెం, పేడ్రాల, ముత్యాలరావు పేట, కొత్త కుంకాల, పాత కుంకాల, రెడ్డినాగంపాలెం గ్రామాల్లో తాగునీరు అందడం లేదని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొండపూడి నుంచి జిల్లెళ్లగూడెం వెళ్లే మార్గమధ్యంలో నాగంపాలెం వద్ద పైప్‌లైన్‌లు మరమ్మతులకు గురయ్యాయని, దీంతో వారం రోజులుగా సత్యసాయి తాగునీరు నిలిచిపోయిందని తెలిపారు. గ్రామాల్లోని చేతి పంపుల నీరు వాడటం వలన జ్వరాలు వస్తున్నాయని, సత్యసాయి పథకం పైప్‌లైన్ మరమ్మతులు చేసి గోదావరి నీరు అందుబాటులోకి తీసుకురావాలని కోటం బాబూరావు, తదితరులు అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

సంత మార్కెట్ అభివృద్ధికి వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న వ్యాపార సంఘ సభ్యులు

కొయ్యలగూడెం: సంత మార్కెట్ అభివృద్ధి చేసి ప్రజలకు వ్యాపార సముదాయాలు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు కూరగాయల వర్తక సంఘం వినతి పత్రం సమర్పించింది. బుధవారం కొయ్యలగూడేనికి విచ్చేసిన ఆయనను సంఘ అధ్యక్ష కార్యదర్శులు వగ్వాల పుల్లారావు, ఉప్పులూరి శ్రీనివాస్ ఈ మేరకు వినతి పత్రం అందించారు. 2017లో సంత మార్కెట్‌కు వెనుక కట్టిన దుకాణ సముదాయాల వలన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. సుమారు ఎకరం విస్తీర్ణంలోని ప్రదేశం వ్యాపారాలకు అనువుగా లేకపోవడంతో వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీని వలన కన్నాపురం రోడ్డులో ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం వలన ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని అత్యవసర వాహనాలు సకాలంలో చేరుకోలేకపోతున్నాయని ఎంఆర్‌పీఎస్ నాయకులు సనమండ్ర కనకరాజు, తమ్మిర్చి బ్రహ్మన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: సెప్టెంబర్ 14న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు కోరారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు , మనోవర్తి కేసులు , ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతీ రోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐ సుధాకర్, నాలుగు మండలాల ఎస్ఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి నాగేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశీలన



నాక్ టీం ప్రశంసలు అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ టీం బుధవారం పరిశీలించారు. గతంలో మంగళగిరి ఏపీ సీసీఈ నుంచి నాక్ పీర్ టీం కళాశాలను పరిశీలించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. వారి సూచనలు, సలహాలు పాటించి కళాశాల అభివృద్ధికి అధ్యాపకులు, విద్యార్థులు నాక్ గ్రేడ్ కోసం ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ ఐదు సంవత్సరాల్లో కళాశాల సాధించిన విజయాలను రెండు రోజులు యూజీసీ నాక్ పీర్ టీం పరిశీలించిందన్నారు. కళాశాలకు నాక్ గుర్తింపు వారం రోజుల్లో గ్రేడ్ ప్రకటిస్తామని తెలిపారన్నారు. గ్రామీణ విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచి వేదిక అని నాక్ పీర్ టీమ్ ప్రశంసించారు.

రాయితీ వరి విత్తనాలు సిద్ధం



పోలవరం రైతు సేవా కేంద్రంలో విత్తనాలతో రైతులు

పోలవరం రూరల్: మండలంలో అధిక వర్షాల కారణంగా నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు తెలిపారు. ఎంటీయూ 7029 రకం 8.40 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 100 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 3 క్వింటాళ్లు, పోలవరం, గూటాల రైతు సేవా కేంద్రాల్లో అందిస్తామన్నారు. 7029, 1121 రకాలు క్వింటాల్ పూర్తి ధర రూ.3980, 5204 రకం క్వింటాల్ పూర్తి ధర రూ.4180గా నిర్ణయించడమైందన్నారు. ఈ విత్తనాలను నారుమడులు నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై అందిస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సకల ప్రాణికోటి జీవించడానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, మంచి వాతావరణం లభించడానికి ఎంతో ముందు జాగ్రత్తగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చేపట్టాలని సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సి సూచించారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటి ఎన్‌సీసీ క్యాడెట్లలో స్ఫూర్తి నింపారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



టాటా ఏస్ వాహనంలో కిక్కిరిసి వెళుతున్న మహిళా కూలీలు

ద్వారకా తిరుమల: పరిమితికి మించి ప్రయాణాలు సాగించడం వలన నిత్యం రహదారులపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా కొందరు వాటిని పట్టించుకోవడం లేదు. పొట్ట కూటి కోసం పనులకు వెళ్లే కూలీలు, పెళ్లి బృందాలు ట్రక్కు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణాలు సాగిస్తున్నారు. అలాగే ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కోలాట భజన మండలి సభ్యుల్లో మహిళలు, చిన్నారులు ట్రక్కు ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. అదే విధంగా పలువురు కూలీలు కొబ్బరి బొండాలు, అరటి గెలలు, కూరగాయలు వంటి వాటిని రవాణా చేసే లారీలు, బొలెరో వాహనాలపై కూర్చుని ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్న దృశ్యాలు నిత్యం మనకు కనిపిస్తున్నాయి. అయినా వాటిని నివారించేందుకు అధికారులు ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదాలు జరిగిన తరువాత బాధపడే కంటే ముందుగానే వాటి నివారణకు చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.